

# ఎండమావులు

సి.జయ

భాస్కరుని అరుణకిరణాలు ఇంకా తన ఉనికిని గుర్తు చేస్తున్నాయి. సాయంత్రం ఎండ వేడి తగ్గి, చల్లని గాలి వీస్తోంది. గాలికి చెట్లు ఊగుతున్నాయి, రాత్రి వచ్చే వెన్నెలకి సంతోషంగా స్వాగతం పలుకుతున్నట్టుగా.

పొగడ చెట్టు క్రింద కూర్చున్న జ్యోత్స్న నెమ్మదిగా శరణాలయం గేటు దాటి రోడ్ మీద పడ్డది.

పార్కులోకి వెళ్లేటప్పటికి భాస్కర్ జ్యోత్స్నకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

“రా, జోత్స్నా! ఇంత ఆలస్యం చేశావేం నువ్వు రావేమో అని భయపడుతున్నాను” జోత్స్న చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కుతూ అన్నాడు.

“రాకుండా ఎలా ఉండగలను భాస్కర్. కానీ, రోజు రోజుకీ నాకు ఎందుకో భయంగా ఉంది ఇలా రావాలంటే” దిగులుగా అంది జోత్స్న.

“ఎందుకు భయం?” సిగరెట్టు వెలిగించి, పుల్ల అవతల పారేస్తూ అడిగాడు భాస్కర్.

“నేను ఉండేది ఒక అనాధశరణాలయంలో. వాళ్ళ భయ భక్తులలో, వాళ్ళ దయా దాక్షిణ్యాలలో బ్రతుకుతున్నాను. నాకో బ్రతుకుతెరువు చూపించేదాకా అందులో ఉంచుకుంటారు. తరువాత పంపేస్తారు. కానీ నేను ఈ లోపల ఇట్లా చాటుగా నీతో పరిచయం రోజూ నిన్ను కలుసుకోవటం లాంటివి వాళ్ళకి తెలిస్తే, ముందుగానే బయటికి పంపివేస్తారు. అప్పుడు నాగతి ఏమిటి?”

“అదా నీ భయం. అంతదాకా ఎందుకు వస్తుంది. నేను ఈలోపల నిన్ను పెళ్ళి చేసుకుని తీసుకుపోతానుగా” ధైర్యం చెబుతూ అన్నాడు.

“నిజంగానా?”

“నిజంగా జోత్స్నా నన్ను నమ్ము”

మౌనంగా ఆలోచిస్తూ కూర్చుండిపోయింది జోత్స్న.



"ఏమిటి ఆలోచిస్తున్నావు? నన్ను నమ్మటం లేదా అడవిపువ్వులా నువ్వు ఈ అనాధ శరణాలయానికి ఆశ్రితం కావటం నాకు ఇష్టంలేదు అనాధశరణాలయాల్లో ఉన్న ఆడపిల్లలకి సంఘంలో సానుభూతి గౌరవం ఉండవు చాలా చులకనగా చూస్తారు

ఆలా కాకుండా, నీకు ఒక వ్యక్తిత్వం చేకూర్చాలని సంఘంలో నీకు గౌరవ మర్యాదలు కలిగించాలని, నాకు చాలా ఆరాటంగా ఉంది ఇలాంటి అవకాశం కోసం నేను ఇన్ని రోజులుగా ఎదురు చూశాను. నేను ఒక ఆదర్శవంతమైన పని ఏదైనా చెయ్యగలిగానూ అంటే అది నిన్ను నేను పెళ్ళి చేసుకోవటమే."

సంతోషంతో జ్యోత్స్న హృదయం పరవశ్యతొక్కింది వెన్నెల రోజులలో సముద్రపు అలలులాగా

"ఎంతటి సంస్కారం ఉంది భాస్కర్‌లో" అనుకుంది తృప్తిగా "నేను చాలా అదృష్టవంతురాల్ని భాస్కర్! ఒకకులం, గోత్రం, దిక్కూ మొక్కూ లేక అనాథశరణాలయంలో ఉన్న నన్ను పెళ్లి చేసుకుని, నాకొక

పరిపూర్ణత ఇస్తానంటే, అంతటి అదృష్టం కంటే నేను జీవితంలో కోరుకుండే దేమీలేదు" అంది తృప్తిగా

*                    *

రోజులు నెలలూ గడిచిపోతూనే ఉన్నాయి సాయంత్రాలు ఎవ్వరూ చూడకుండా వెళ్ళి వచ్చేది జ్యోత్స్న

ఆరోజు ఆదివారం

ఎవరికి తెలియకుండా భాస్కర్‌తో సినిమాకి వెళ్ళింది జ్యోత్స్న

ఇద్దరూ సినిమాకి వెళ్ళారు సినిమా జోరుగా సాగుతోంది ఇంగ్లీషు సినిమా అది ముద్దులు కౌగిలింతల సీన్లు చూసే టప్పటికి వేడెక్కి పోయింది ఇద్దరికీ సినిమా చూస్తున్నంత సేపూ

సినిమా పూర్తి అవగానే, బయటికి వచ్చారు ఇద్దరూ "అబ్బ, ఆకలేస్తోంది ఏదన్నా తిందాం పద" అని హోటల్‌కి పోయి టిఫిన్ తిన్న తరువాత, టాక్సీలో ఒక చిన్న ఇంటిముందు ఆపించాడు భాస్కర్

"దిగు జ్యోత్స్నా"

గదిలోకి వెళ్ళి లైటు వేశాడు భాస్కర్ ఒకమంచం, కిటికీలో ఒక కూజా, గ్లాసూ, ఒక ప్లాస్కూ, గది చాలా నీటుగా, సింపుల్‌గా ఉంది

"కూర్చో జ్యోత్స్నా" జ్యోత్స్న భుజాలు పుచ్చుకుని మృదువుగా కూర్చో పెట్టాడు

ఒక్కసారి పిండుగా నవ్వింది జ్యోత్స్న

"అబ్బ, నీ నవ్వు ఎలా ఉందో తెలుసా ? అప్పుడే విచ్చిన గులాబీమీద మంచుబిందువులు పడితే ఎలా ఉంటుంది?"

మళ్ళీ నవ్వింది జ్యోత్స్న "ఎలా ఉంటుంది?"

"ఎలా వుంటుందా? నీ నవ్వులా ఉంటుంది' రెండు చేతులలో జ్యోత్స్న ముఖం దగ్గరకు తీసుకుని పెదిమలమీద గాఢంగా ముద్దుపెట్టుకున్నాడు

అభ్యంతరం చెప్పలేదు జ్యోత్స్న. వయసులో వున్న వేడి, దానికి తోడు అంతకుముందు చూసొచ్చిన సినిమా ప్రభావం జ్యోత్స్నని అడ్డుచెప్పనియ్య లేదు

ఒళ్లు తెలియని, ఎక్కడో ఆనంద లోకాలకి, మధురసీమలకి చేరుకున్నారు

రెండు గంటల తరువాత నెమ్మదిగా తేరుకున్నారు ఇద్దరూ నలిగిన చీరె, రేగిన తల, బద్ధకంగా, మత్తుగా జరిగిన స్మృతి మనసులో మెదులుతుంటే సిగ్గుగా లేచికూర్చుంది

"జ్యోత్స్నా, నువ్వెలా వున్నావో తెలుసా? నలిగిన గులాబీలా నిన్ను విడిచిపెట్టలేను" జ్యోత్స్నని హృదయానికి చేర్చుకుంటూ అన్నాడు భాస్కర్.

'నాకూ అలాగే వుంది కానీ ..."

"బాధపడకు మన పెళ్ళికి త్వరలోనే మంచి ముహూర్తం పెట్టిస్తాము"

"నిజంగా!'

"నిజం కాకపోతే అబద్ధం చెబుతానా? పద నిన్ను దింపుతాను" అని బయలు దేరాడు

అదృష్టవశాత్తు శరణాలయం గేటు దగ్గర ఎవరూలేరు గేటు ఓరగా తెరిచే వుంది చప్పుడు చెయ్యకుండా గదిలోకి వెళ్లి పడుకుంది జ్యోత్స్న.

జరిగింది అనాథ శరణాలయంలో ఎవరికీ తెలియలేదు.

మూడు నెలలు గడిచిపోయాయి ప్రతి రోజూ జ్యోత్స్న భాస్కరరావు గదికి వెళ్ళటం, రాత్రి ఏ పది గంటలకో రావటం జరిగిపోతోంది

కానీ అన్ని రోజులూ ఒకలా ఉండవు ఉంటే మనిషిలో దైవత్వమే ఉంటుందేమో మరి

ఆరోజు రాత్రి జ్యోత్స్న టాక్సీ దిగి వస్తుంటే శరణాలయం వార్డెను చూసింది

గజగజా వణికిపోయింది జ్యోత్స్న

"ఎక్కడినుంచి వస్తున్నావు?" గంభీరంగా అడిగింది వార్డెను మాట్లాడలేదు జ్యోత్స్న తలవంచుకుని అలాగే నిలబడి పోయింది.

"చెప్పు జ్యోత్స్నా, టాక్సీలో నిన్ను దిగబెట్టిన అతను ఎవరు? ఎన్నిరోజుల నుంచి ఇలా జరుగుతోంది?"

"దాదాపు నాలుగు నెలల నుంచీ" భయం భయంగా అంది.

"అతను ఎవరు?"

"అతనూ, నేనూ ప్రేమించుకున్నాం. నన్ను పెళ్ళి చేసుకుంటానని మాట ఇచ్చాడు"

"అందుకని ముందుగానే కాలు జారా వన్నమాట"

" "

"అతను నిన్ను మోసగిస్తే నీ గతి ఏమౌతుంది? నిన్ను కన్న తల్లీ, తండ్రీ ఎవరో నీకు తెలియదు ఏవిధంగా మరి ఏ పరిస్థితుల్లో కని, నిన్ను ఈ అనాధ శరణాలయంలో వదిలారో తెలియదు. తల్లీ, తండ్రీ దిక్కూ మొక్కూ 'నా' అన్న వాళ్ళులేని అనాధవి నువ్వు.

నీకు సంఘంలో తగిన స్థానంలేదు. విలువలేదు. రేపు నీకు ఏదైనా జరిగితే నీ మీద జాలిపడి, కనీసం సానుభూతి కూడా చూపించదు ఈ సంఘం అలాంటప్పుడు నువ్వు ఎంత జాగ్రత్తగా వుండాలి?

"ఇప్పుడు నువ్వు ఏ గర్భవతివో అయితే, నీకు పట్టినగతే నీ బిడ్డకు కూడా కల్పిస్తావా? 'నా' అన్నవాళ్లు లేకుండా చేస్తావా?"

" " ఈసారికూడా మాట్లాడ లేదు జ్యోత్స్న వార్డెను కోప్పడుతుంటే నిజానిజాల్ని వూహించటానికి భయపడ్డది.

"మాట్లాడవేం జ్యోత్స్నా?"

"సిస్టర్, నేను అతన్ని ప్రేమించాను. నమ్మాను నాకు యిప్పుడు మూడోనెల. అతను నన్ను పెళ్ళి చేసుకుంటానన్నాడు" కొంచెం ధైర్యంగానే అంది.

"నువ్వు గర్భవతివా? ఎంతపని చేశావు జ్యోత్స్న?" అతను నిన్ను పెళ్ళి చేసుకుంటే ఫరవాలేదు. లేకపోతేమటుకు నువ్వు ఇక్కడ ఉండటానికి వీలులేదు

నీలాంటి అనాధలు యెంతోమంది వున్నారు ఇక్కడ. వాళ్ళకి నీ ప్రవర్తన ఆదర్శం, గుణపాఠం కాకూడదు సరే రేపు నీతో నేనూ వస్తాను అతన్ని నాకు చూపించు. మీ పెళ్ళి విషయం మాట్లాడు తాను" సీరియస్‌గా చెప్పి వెళ్ళిపోయింది వార్డెన్ రోజ్‌లీ.

పంజరం విడిచిన పక్షిలా అయింది జ్యోత్స్న మనసు. "తను ఇవ్వాళ భాస్కర్‌తో తన విషయం అంతా చెప్పేసింది తను. తను తల్లి కాబోతోందని, త్వరలో పెళ్ళిచేసుకుందాం అని.

అతను ఇంతవరకూ ఆమాటే ఎత్తలేదు అందుకని ఇవ్వాళ అడిగింది తను. త్వరలో ముహూర్తం పెట్టిస్తా నన్నాడు రేపు సిస్టర్ రోజ్‌లీని తీసుకు వెళ్ళి అన్ని సంగతులూ మాట్లాడే సెయ్యాలి

భవిష్యత్తు మధురంగా, హాయిగా ఉంటుంది తనూ ఒక ఇంటికి గృహిణి కాబోతోంది.

హు తన బ్రతుకు ఎలాంటి బ్రతుకు! దిక్కూ, మొక్కూ లేని ఒక అనాధ తను. "నా" అన్న వాళ్ళుగానీ, జాతి, మతం, కులంగానీ, సంఘంలో స్త్రీకి సామాన్యంగా ఉండవలసిన గౌరవం విలువకూడా లేనిప్రాణి తను.

ఈ అనాధ శరణాలయాల్లాంటివి ఉండబట్టి తనలాంటివాళ్ళు బ్రతుకుతున్నారు

కానీ ఇకముందు తను ఒక గృహిణి, ఒక సంస్కారవంతుడు, విశాలహృదయుడికి భార్య కాబోతోంది అబ్బ భాస్కర్ ఎంత మంచివాడు! అతన్ని తలచుకుంటేనే తన మనసు ప్రేమతో, ఆరాధనతో తన మనసు నిండిపోతోంది ఆలోచనలలో, ఎప్పటికో నిద్రపోయింది ఆరాత్రి


మర్నాడు సాయంత్రం వార్డెన్ రోజ్‌లీని వెంటపెట్టుకుని భాస్కర్రావు గదికి వెళ్ళింది జ్యోత్స్న—

గది ఖాళీగా ఉంది!

గదిలో అతని సామానులాంటిది కూడా ఏమీలేదు గుండె ఝల్లుమంది జోత్స్నకి బాధతో కృంగిపోతూ అవతలగా ఉన్నవాళ్ళని భాస్కర్‌ని గురించి అడిగింది

అతను పొద్దునే గది ఖాళీ చేశాడని, ఒక ఉత్తరం మటుకూ ఇవ్వమన్నాడని ఒక కవరు తెచ్చిఇచ్చింది ఒక ఆవిడ ఉత్తరంవిప్పి ఆత్రంగా చదివింది జ్యోత్స్న

"జ్యోత్స్నా", ఇన్నాళ్లూ మనఇద్దరం ఏదో కలిసి గడిపాం. దిక్కూ, మొక్కూ, కులం, గోత్రం లేని నిన్ను చేసుకోవటానికి మావాళ్ళు ఒప్పుకోరు.




ఇంక నీ సంగతి అంటావా, నువ్వు ఉన్నది అనాథ శరణాలయంలో నీకు పుట్టే బిడ్డను నీలాగే అక్కడే పెంచు ఆ విషయంలో నీకు కష్టం కాదను కుంటాను

అయినా, అనాథ శరణాలయాల్లో ఉన్న నీలాంటి వాళ్ళకి, శీలమని గుణ మని పవిత్రమైన విషయాల్లో మీకు విలువ ఏముంది? నిన్ను అడిగేది మటుకూ ఎవరు?

నేను నిన్ను వాడుకున్నట్టు, ఇంతకు ముందు నిన్ను ఎంతమంది ఉపయోగించు కున్నారో? భవిష్యత్తులో ఇంకా ఎంతమంది నీకు నాలాగా పరిచయం అవ్వాలో

ఏదో వయసు తొక్కే పొంగులో, ప్రవాహంలో ఇద్దరం కలిశాం ఎలా కలిశామో అలాగే విడిపోదాం

నీ వాడు కాని

భాస్కర్.

ఉత్తరం చదవటం పూర్తిచేసి, బేలగా అలాగే నిలబడిపోయింది జ్యోత్స్న

వార్డెన్ కూడా ఉత్తరంచదివి, "అతను ఎక్కడికి వెళ్లాడో అడ్రస్సు ఏమైనా మీకు తెలుసా?' ఉత్తరం ఇచ్చిన ఆవిడని అడిగింది.

"అబ్బే ఆ వివరాలు ఏమీ మాకు తెలియవు అసలు అతనిది ఈ ఊరు కూడా కాదు '' అన్నది ఆవిడ

* *

'నీలాంటివాళ్ళకి ఇక్కడ స్థానం లేదు నీ ప్రవర్తన ఇక్కడ ఉన్న వాళ్ళకి మార్గదర్శం కాకూడదు నువ్వు చేతులారా చేసుకున్న ఖర్మ వెళ్ళిపో''

అని పంపేశారు అనాథశరణాలయం హెడ్ సిస్టర్. వార్డెనుకూడా.

నీళ్ళల్లోంచి బయటపడ్డ చేపలా గిల గిలా కొట్టుకుంది జ్యోత్స్న మనసు

"ఏం జరిగింది ?

ఒక్కరోజు క్రితం తన భవిష్యత్తుని స్వర్గంలా ఊహించుకున్న తను, ఒక్క రోజు తేడాలో దారుణంగా వాస్తవమైన నరకానికి తోయబడింది

"ఊహకి, వాస్తవానికి ఎంతతేడా"

"ఎందుకిలా జరిగింది ?

ఎదిగీ ఎదగని వయస్సు, పూర్తిగా పరిపూర్ణత చేకూర్చుకోలేని, వికసించని మనసు, బయట ప్రపంచం లోకంతీరూ తెలుసుకోకుండా తను పెరిగిన వాతా వరణం పూర్తిగా తన పతనానికి అవ కాశం ఇచ్చాయి

"భాస్కర్! ఎంత మంచివాడు అను కుంది తను! మనిషి అందమైన వాడు మాటలు తియ్యగా మాట్లాడ గలిగే నేర్పు ఉంది అతనికి మనసు మటుకూ హూ మేడి పండులాంటి మనిషి

"తను అతని మాటలు ఎంతగా నమ్మింది! మనస్ఫూర్తిగా ప్రేమించింది మొట్ట మొదటిసారిగా పిచ్చిగా ఆరాధిం చింది, అతనే లోకం అనుకుంది

అతనుకూడా తనని ఎంతో ప్రేమి స్తున్నాడు అనుకుంది తను

కానీ, అది ఒట్టి భ్రమ ఎండ మావిలా అయిపోయింది తన జీవితం తనలో అతను ఆడుకున్నాడు. అవస రానికి వాడుకున్నాడు భోజనం చేసిన తరువాత, తిని పారేసిన విస్తరిలా వాడు కున్నాడు ఇలా ఎంతమందిని మోసం చేశాడో!

తను ఒక అనాథ కాబట్టి, తనకి సంఘంలో విలువలేదు కాబట్టి దులపరించు కుని తేలిగ్గా వెళ్ళిపోయాడు,

'తనలాంటి తెలియని అమాయకు లైన అనాథలకి ఇంతకంటే సంఘంలో విలువలేదు కాబోలు! అనాథ అంటే అందరికీ అలుసే అనాథ శరణాలయంలో పెరిగిన ఆడపిల్లలకి సంఘంలో విలువ లేదు ఇలాంటి సంకుచితమైన మను ష్యులముందు తమలాంటివాళ్ళకి గౌరవం ఎలా వస్తుంది?

"భాస్కర్' ఎటువంటి భాస్కర్!

"ఎంత సంస్కారవంతుడుగా ప్రవ ర్తించాడు! ఎన్ని ఆదర్శాలు పలికాడు! బహుశ, ఆడపిల్లల్ని మృదువుగా వశ పరచుకుని, మోసం చెయ్యటానికి ఇదొక కొత్తరకం వల కాబోలు!"

అతిగా ప్రేమించిన మనిషి మీదే, ద్వేషం కూడా పెరుగుతుంది వక్రిస్తే, అతనిపేరు తలచుకుంటే ద్వేషంతో నిండి పోయింది జోత్స్న మనసు పగ సాధిం చాలనే పట్టుదలా ఎక్కువైంది

కానీ ఎలా ? అతని జాడే తెలియదే తెలివిగా తప్పుకున్నాడు.

* *

రోడ్డుమీద నడుస్తోంది జ్యోత్స్న. మనసు బాధతో నలిగిపోతోంది. ఆలోచనలు నలిగిన తన మనసుని ఇంకా హింపిస్తున్నాయి

"తను ఇప్పుడు ఒట్టి మనిషికూడా కాదు అసలు లోకంలోకి వచ్చింది ఇప్పుడు ఈ స్వార్థపులోకంలో ఎలా బ్రతుకుతుంది తను? తన జీవితం గడిచేదెలా?

ఈ సంఘంలో, ఇప్పుడు తనుఉన్న పరిస్థితిలో జాలీ, సానుభూతి చూపించరు సరికదా బ్రతికి ఉండగానే చిత్రహింస చేస్తారు

"ఛీ, ఛీ తను గర్భవతి కావడం కూడా ఎంత దురదృష్టం!

"ఆ దుర్మార్గుడి ప్రతిరూపం తనలో పెరుగుతుంటే అది తను భరిస్తూ, ఆ తరువాత పెంచగలిగే ఓర్పులేదు తనకి

"స్త్రీ మాతృత్వంకోసం పరితపిస్తుంది కలలు కంటుంది, ప్రతిఫలాన్ని చూసి మురిసిపోతుంది

ఎప్పుడూ—?

ఆ స్త్రీకి సంఘంలో గౌరవం, విలువా ఉన్నప్పుడే, ఆ స్త్రీని స్త్రీగా, పవిత్రురాలిగా చూసినప్పుడే ఆ స్త్రీ జీవితంలో స్థిరపడి ఒక గమ్యం చేరుకోగలిగిన నాడే, ఆ స్త్రీ మాతృత్వం కోరుకుంటుంది మురిసిపోతుంది అప్పుడే ఆ స్త్రీ జన్మసార్థకం అయినట్టు, ఆ మాతృత్వానికి పవిత్రత, విలువా ఉన్నట్టు

కానీ——,

తనలాంటి ఆడది, దిక్కూ మొక్కూ లేని అనాధ, కులం, జాతి, మతంలేని, నా అన్నవాళ్ళు ఎవ్వరూ లేని అనాధ స్త్రీ పెళ్ళి కాకుండానే కాలుజారి, గర్భవతి అయితే.

లోకం సంఘం గౌరవించదు సరికదా, సానుభూతికూడా చూపించదు తనలాంటి స్త్రీకి మంచికీ, సానుభూతికీ చోటులేదు గౌరవం, విలువా, పవిత్రతా అంతకన్నా ఉండవు తను మాతృమూర్తి అయితే—

మరి అటువంటి పరిస్థితిలో మాతృమూర్తి కావాలని, పుట్టిన బిడ్డకి తల్లి అయి, సంరక్షణ చెయ్యాలి అని కోరుకోవటం కంటే, "ఒక గొడ్రాలు అయితే ఎంత బాగుండు' అని కోరుకోవటంలో అసహజమేముంది?

తనకి పుట్టబోయేబిడ్డ బ్రతికి, బట్టకట్టి తనని ఏదో ఉద్ధరిస్తాడేమో అన్న భ్రమతో ఆ శిశువు పుట్టటానికి అవకాశం ఇస్తే, ఒక పాతికేళ్ళ జీవితంవరకూ తను ఆ బిడ్డతో ఎలా బ్రతకాలి? అన్న ప్రశ్నకు జవాబు ఏవిధంగా దొరుకుతుంది?

పోనీ , తీరా పెంచి పెద్దచేశాక తల్లిగా తనని గౌరవిస్తాడని నమ్మకం ఏముంది? తన కష్టాలు అప్పటికైనా గట్టు ఎక్కుతాయని ఆశమటుకూ ఏముంది?

"తన బ్రతుకే ఒక సమస్య అయి

నప్పుడు. దానికితోడు. మాతృత్వం అనే పేరుతో తన జీవితంలో మరో ప్రాణికి చోటు ఇచ్చి. తన జీవితం ఇంకా దుర్భరం చేసుకోలేదు అటువంటి మాతృత్వమే వద్దు తనకు.

అంటే——

మాతృత్వానికి ఉన్న విలువా, గౌరవం, పవిత్రత తను పోగొట్టుతోందా——?

స్త్రీకి ప్రకృతి సహజమైన మాతృత్వం అనే ఒక పవిత్రమైన కోరికను కొంతమంది కలలుకని కోరుకోవటం——

కొంతమంది ఆ కోరికను తలచుకుని భయపడి అసహ్యించుకుని ఆ మాతృత్వం రాకుండా చేసుకోవాలని ప్రయత్నించడం——

మరి విలువా, గౌరవం, పవిత్రత ఆ మాతృత్వపు కోరికలో ఉందా?

లేకపోతే ఆ కోరిక కోరుకునే మనుష్యుల్లో ఉందా——?

ఎంత తమాషా సృష్టి ఇది!

ఆలోచనలతో రోడ్డుమీద నడుస్తూ. ప్రక్కగా ఒక ఇంటికి తగిలించిన బోర్డు చూసింది

'డాక్టర్. మిసెస్ సుశీల ఎమ్. డి'' అన్న బోర్డు చూసి యాంత్రికంగా లోపలికి నడిచింది

నీరసంగా అక్కడే ఉన్న బల్లమీద కూర్చుంది కళ్ళు తిరుగుతున్నాయి. ఆకలి కూడా వేస్తోంది.

ఇంతలో అక్కడే ఉన్న ఒక నర్సు వచ్చి జ్యోత్స్నని పలకరించి, డాక్టరుతో చెప్పి. లోపలికి తీసుకువెళ్ళింది

* *

''నువ్వు చేసిన పనేమీ బాగలేదు. పైగా నన్ను ఈ విషయంలో సహాయం చెయ్యమంటే నేను ఎలా చెయ్యగలను!'' జ్యోత్స్న చెప్పినదంతా విని అన్నది డాక్టరు.

"డాక్టర్ మీరు నన్ను పూర్తిగా అర్థం చేసుకోండి డాక్టర్ ''నా'' అన్న వాళ్లు లేరు నాకు దిక్కులేని దాన్ని తెలియకే తప్పు చేశాను నేను కళ్ళు తెరిచి చూసేటప్పటికి ఈ స్థితిలో ఉన్నాను నామీద కొంచెం కనికరించండి డాక్టర్, లేకపోతే నాజీవితమే అంతం చేసుకుంటాను అంతే కాని, నాకుపుట్టే పాపని ఈ పాపిష్టిలోకంలో పెంచుతూ నేను బ్రతకలేను'' చాలా బాధపడుతూ తన కథ అంతా చెప్పి. డాక్టర్ని బ్రతిమిలాడింది జ్యోత్స్న

డాక్టర్ సుశీలకి జాలివేసింది జ్యోత్స్న మీద

నిజమే జ్యోత్స్న పుట్టే పాపని ఎలా పెంచుతుంది? ఊహవేరు వాస్తవం వేరు ఏంపెట్టి పెంచుతుంది! తన బిడ్డకి కూడా మళ్ళీ అనాథ శరణాలయమే నీడకావాలంటే, భయమేమరి.

ఆ అనాథ శరణాలయంలో పెరిగిన జ్యోత్స్నకి ఏమాత్రం విలువా, గౌరవం ఉంది?

విలువా, గౌరవం లేకపోబట్టేగా,




భాస్కర్రావు మోసగించి తెలివిగా తప్పుకున్నాడు.

ఇలాంటి హీనస్థితిలో ఒక ప్రాణికి పుట్టుక ఇచ్చేకంటే, పుట్టకుండా ఉండటమే మంచిది. కొంచెం విశాలంగా ఆలోచించింది డాక్టరు సుశీల.

"సరే జ్యోత్స్న. నేను ఎప్పుడూ ఇటువంటి పని చెయ్యలేదు. నేనూ తల్లిని, నాకూ పిల్లలు ఉన్నారు. అందుకే నీకు ఈ ఎబార్షన్ చెయ్యటానికి ఒప్పుకుంటున్నాను" అంది డాక్టరు.

* *

పదిహేను రోజులు గడిచిపోయినాయి. జోత్స్న మామూలు మనిషి అయింది.

"డాక్టర్. మీరు నాకు ఎంతో మేలు చేశారు. మీకు ఫీజుకూడా ఇచ్చుకోలేని అభాగ్యురాల్ని మన్నించండి మీరుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేను. ఇంక నాకు శెలవు ఇప్పించండి. వెళ్తాను" కృతజ్ఞతగా అంది జోత్స్న.

"పిచ్చిదానా, నాకు ఫీజు ఇచ్చుకునే పరిస్థితే నీకుఉంటే, అసలు నువ్వీ పని ఎందుకు చేస్తావు? ఆ విషయం ఏం బాధపడకు.

"సరే .. నువ్వు ఇప్పుడు ఎక్కడికి పోతావు?

"దిక్కులేనివాళ్ళకి దేముడేఉన్నాడు. ఇంకా ఏం నిర్ణయించుకోలేదు" తల ఒంచుకుని అంది.

"ఏ నిర్ణయం లేకుండా ఎక్కడికని

వెళ్తావు? నేను విన్సు నర్సు ట్రైనింగుకి పంపుతాను. నీకు ఇష్టమేనా?" అడిగింది డాక్టర్.

కృతజ్ఞతతో నిండిపోయింది జ్యోత్స్న మనసు ఎంత విశాల హృదయురాలు! తను నిజంగా ఆవిడలో భగవంతుడినే చూసింది

"ఎంత మంచిమనసు మీది డాక్టర్. నా బ్రతుకుతెరువుకి ఒక దోవచూపిస్తున్నారంటే, మీరు నిజంగా దేవుడే. తప్పకు డావెళ్తాను" అంది జ్యోత్స్న.

* *

జ్యోత్స్న ట్రైనింగుకి ఆర్డర్సు వచ్చాయి.

"వెళ్ళొస్తాను డాక్టర్" కళ్ళంబడి నీళ్ళలో సవినయంగా నమస్కరిస్తూ అంది జ్యోత్స్న.

"మంచిది వెళ్ళిరా జ్యోత్స్న. కానీ— ఒక్క విషయం చెబుతున్నాను.

"ఒక్కసారి తెలియక చేసిన పొరపాటుని అలవాటుగా మాత్రం మార్చుకోకు.

"జీవితం అంటే గులాబీ పువ్వులా ఉంటుంది అని అనుకునే వయసు నీది.—

కానీ—. ముళ్ళుకూడా ఉంటాయి. అవి దారుణంగా గుచ్చుకుంటాయి అని చెప్పగలిగే వయసూ, అనుభవమూ నాది.

"జాగ్రత్త. ఎప్పుడైనా వచ్చిపోతూ ఉండు నీకు ఎప్పుడైనా, ఏదైనా సహాయం కావాలంటే, నేను ఉన్నానని మాత్రం మర్చిపోకు" అని పంపించింది డాక్టర్ సుశీల.

* *

రోజులు గడచిపోతూనే ఉన్నాయి. నాలుగు సంవత్సరాల ట్రైనింగు పూర్తి అయింది జోత్స్నకి.

సికింద్రాబాదు మిలటరీ హాస్పటల్‌లో నర్సుగా ఆర్డరు వచ్చింది జోత్స్నకి.

కాలచక్రం గిరగిరా తిరిగిపోతోంది.

* *


హాస్పటల్ కిట కిట లాడుతోంది చైనాయుద్ధం జరుగుతున్న రోజులు అవి.

సికింద్రాబాద్‌నుంచి జోత్స్నని మరి కొంతమంది నర్సుల్ని ఢిల్లీ హాస్పటల్‌కి పంపించారు

రోగులకు సేవచెయ్యటమే తన డ్యూటీగాపెట్టుకుంది జోత్స్న. వయసులో ఉన్న ఉద్రేకంలోనూ తెలివి తక్కువతనంలోనూ జరిగిన తన అనుభవం తనకి మంచి పాఠమే నేర్పింది. ఆ అనుభవంతో తను మానసికంగా చాలా ఎదిగిపోయింది.

పూర్వం ఉన్న ఉద్రేకం కోరికలూ లేవు అణగారిపోయినాయి. అస్తమానం పనివల్ల, చాలా బిజీగా ఉంటుంది. మనసుకి ఎటువంటి ఆలోచనలూ రావటంలేదు. ఎంతోమంది డాక్టర్లు వస్తూవుంటారు పేషెంట్లని చూసేందుకు. కానీ ...., తన పనేదో తనది, తన డ్యూటీ ఏదో తనది.

కనీసం ఇందులోనైనా తను తన




బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చగలిగితే. తన జీవితానికి అంతేచాలు.

* * *

"అబ్బ. సిస్టర్. ప్లీజ్. నాకు చాలా బాధగా ఉంది సిస్టర్. నాకు ఈ బాధ తగ్గాలి. నేను మళ్ళీ వార్‌లోకి వెళ్ళాలి. నాకు తొందరగా తగ్గాలి సిస్టర్" పేషెంటు బాధ పడుతున్నాడు విపరీతంగా.

"మీరు అలా బాధ పడకూడదు మిస్టర్ రావు. మీకు తప్పకుండా తగ్గుతుంది. మీరు మళ్ళీ ఫ్రంటుకి వెళ్తారు. శత్రువుల్ని జయిస్తారు. దేశక్షేమాన్ని కోరే మీకు తప్పకుండా తగ్గుతుంది మీరు రెస్టు తీసుకోండి" పేషెంటు తల నిమురుతూ, ధైర్యం చెబుతోంది జోత్స్న

ఏమిటో ఈ నర్సు జీవితం! తమాషాగా ఉంటుంది ఏదీ తనది అనుకోకూడదు. ఏదీ శాశ్వతం అనుకోకూడదు.

పేషెంట్లని ఎవ్వరినీ ప్రేమించకూడదు కానీ ప్రేమ నటించాలి. వాళ్ళకి ఆదరణ చూపాలి. ప్రేమగా సేవలు చెయ్యాలి

వాళ్ళు ఆరోగ్యవంతులైన తరువాత హాయిగా నవ్వుతూ వెళ్ళిపోతారు.

వాళ్ళు బెడ్డుమీద ఉన్నంతసేపూ తన సొంతవాళ్ళలాగానే భ్రమపడాలి. భ్రమపడుతుంది కూడా

వాళ్ళకి ఆరోగ్యం వచ్చి వెళ్ళిపోతే తను మళ్ళీ ఒంటరిగానే మిగిలిపోతుంది.

మరి తనకి ఏం మిగులుతుంది? ఈ ఒంటరితనం. నాకు ఎవ్వరూ లేరు అనే బాధేనా?

లేదు వాళ్ళ ఆనందమే తనకు మిగులుతుంది పేషెంట్లకి రోగం నయం అయ్యాక వాళ్ళు పడే ఆనందం. తృప్తి తనకు చాలు అవే తన శ్రమకి ప్రతిఫలాలు .

"డాక్టర్, డాక్టర్" ఆలోచనలలోంచి

తేరుకుని, కంగారుగా డాక్టరుని పిలిచింది జోత్స్న.

"ఏమిటి సిస్టర్? ఏమి జరిగింది?" కంగారుపడుతూ వచ్చాడు డాక్టరు.

"ఈ పేషెంట్ కండిషన్ ఏమీ బాగా లేదు. వచ్చి చూడండి"

డాక్టరు వచ్చిచూశాడు మరో పది నిముషాలకి అతని ప్రాణం అనంత విశ్వంలో కలిసిపోయింది.

బాధపడ్డది జోత్స్న మనసు అతని చరిత్ర ఎలాంటిదో, తల్లితండ్రులు, భార్యా పిల్లలూ ఉన్నారో, లేరో, ఇంకె వరు ఉన్నారో....ఎక్కడ పెరిగాడో.... ఈరోజు ఇక్కడ మట్టిలో కలిసిపోతు న్నాడు.... ఏమిటో ఆలోచిస్తూ అలాగే నిలబడిపోయింది జ్యోత్స్న.

"సిస్టర్, ఏమిటి అలా నిలబడి పోయారు? టేక్ ఇట్ ఈజీ. ఇవన్నీ మనసులో పెట్టుకుంటే నేను డాక్టరుపని, మీరు ఈ నర్సుపనీ చెయ్యలేం. అందు కనే డాక్టర్ల జీవితాల్లో, నర్సుల జీవితాల్లో చావు, పుట్టుకలు ఒకటిగానే తీసుకోవాలి. దేన్నీ మనసులో ఉంచుకోకూడదు ఊ.... కమాన్. డూ యువర్ డ్యూటీ" జ్యోత్స్నని హెచ్చరించి వెళ్ళిపోయాడు డాక్టరు.

ఒక్క నిట్టూర్పు విడిచి, అక్కడి నుంచి కదిలింది జ్యోత్స్న.

* *

మర్నాడు పొద్దున్న జ్యోత్స్న డ్యూటీ లోకి వచ్చేటప్పటికి మరో కొందరు పేషెంట్లు కొత్తగా వచ్చారు. మరో నలుగురు డాక్టర్లు కొత్తగా వచ్చారు

పేషెంట్లకి కట్లు కట్టేవాళ్ళు, ఆప రేషన్ చెయ్యటానికి హడావిడి పడేవాళ్ళు, చాలా హడావిడిగా ఉంది హాస్పటల్.

"సిస్టర్, ఈ పేషెంటుకి వెంటనే ఆపరేషన్ చెయ్యాలి. కండిషన్ చాలా సీరియస్‌గా ఉంది. నాకు ఆ ఛార్టు ఇచ్చి, మీరు వెళ్ళి కావలసిన ఎరేంజ్ మెంట్సు చూడండి స్టెరిలైజ్ చెయ్యండి ఇన్‌స్ట్రు మెంట్సు అన్నీ" అన్నాడు డాక్టరు.

ఛార్టు ఇవ్వటానికి వచ్చి, స్పృహ లేకుండా పడుకున్న పేషెంటుని చూసి ఒక్కసారి విభ్రాంత పోయింది జోత్స్న.

భాస్కరావు! ఇక్కడి కెలా వచ్చాడు? ఆలోచిస్తూ నిలబడిపోయిన జ్యోత్స్నని మరొకసారి హెచ్చరించాడు డాక్టరు.

"సిస్టర్ క్విక్, ప్లీజ్ ఎరేంజ్"


"డాక్టర్, ఇతనికేనా మీరు ఆపరేషన్ చెయ్యబోయేది?"

"అవును ఏం?"

"క్షమించండి డాక్టర్. నేను అసిస్ట్ చెయ్యలేను."

"సిస్టర్, ఏమిటిది? ఎందుకిలా మాట్లాడుతున్నారు?"

"క్షమించండి డాక్టర్, ఇప్పుడు నేనేమీ చెప్పేస్థితిలో లేను" తల ఒంచు కుని బాధగా అంది.




''వీల్లేదు సిస్టర్, మీరు చేసి తీరాలి. మీ డ్యూటీ మీరు చెయ్యాలి. ఇది మామూలు హాస్పటల్ కాదు.

మిలటరీ హాస్పటల్. వీళ్ళంతా దేశమాతకోసం వాళ్ళప్రాణాల్ని కూడా లెక్క చెయ్యని వీరులు. వీళ్ళకి సహాయంచేసి, వాళ్ళకి సహకరించటం మనవిధి. మన కనీసధర్మం. ఒక విధంగా మనం కూడా దేశం కోసమే శ్రమ పడుతున్నాం. ఈ స్థితిలో మీరు వెళ్ళిపోతే, అతనికి ఆపరేషన్ చేసేందుకు వీలుఉండదు. ఆపరేషన్ చెయ్యకపోతే అతను బ్రతకడు. మీడ్యూటీ, మీధర్మం, మీరు చెయ్యాలి. అంతే'' డాక్టరు దాదాపు గంభీరంగా అన్నాడు.

''ఏమిటి ఈ వైపరీత్యం''

తన జీవితంలో బొమ్మలాట ఆడుకుని, తనని మోసంచేసి, సర్వనాశనం చేసిన మనిషికి సహాయంచేసి, ప్రాణం నిలబెట్టాలా?

అతనిమీద ఉన్న ప్రేమ అంతా ద్వేషంగా మారి ఆ మనిషి కనిపిస్తే, పగసాధించాలని అవకాశంకోసం ఎదురు చూసింది తను.

ఇప్పుడు ఆ మనిషి తన కళ్ళ ఎదురుగా పడివున్నాడు. తను అతని మీద పగ సాధించాలని ఎంతో కాలంగా ఎదురు చూసిన తనకి, యిప్పుడు అతనికి సేవలు చేసి బ్రతికించాలా? సపర్యలుచేసి అతని బాధలు తీర్చాలా?

భగవంతుడా! ఎంత తమాషా చేస్తావు? ఈ పరిస్థితిలో ఆ మనిషిమీద పగసాధించి, తనకున్న కసి తీర్చుకోగలదా!

లేకపోతే, సిన్సియారిటీయే ధ్యేయంగా పెట్టుకున్న తను తన డ్యూటీ నిర్వర్తించటానికే సిద్ధపడుతుందా——?''

''సిస్టర్, గో అండ్ డూ యువర్

డ్యూటీ'' డాక్టర్ హెచ్చరించటంతో.

''యస్ డాక్టర్. అయామ్ గోయింగ్'' అని కదిలింది జోత్స్న.

ఆపరేషన్ పూర్తి అయిపోయింది

తను ఓడిపోయింది. ఏదీ తన చేతుల్లో లేదు. అయినా, తను ఇక అక్కడే వుండి, అతనికి సేవలు చెయ్యలేదు. అతనిని తప్పించి, మిగతా పేషెంట్లకి సేవలు చెయ్యటం అసంభవం.

మధ్యాన్నం హాస్పిటల్‌లో అడుగు పెట్టిన జ్యోత్స్నని, గుర్తుపట్టి, పలకరించాడు భాస్కరరావు.

"జ్యోత్స్నా. నువ్వు ఇక్కడ ఉన్నావా? నన్ను క్షమించు జ్యోత్స్నా. నీకు చాలా అన్యాయం చేశాను. నిన్ను మోసంచేసి వెళ్ళిపోయాక నాలో చాలా పరివర్తన వచ్చింది. వెంటనే మిలటరీలో చేరి పోయాను ఇప్పుడు నేను నిన్ను మోసం చేసిన పూర్వం భాస్కరరావుని కాదు జోత్స్నా. నన్ను క్షమించావా అను'' జరిగినదానికి పశ్చాత్తాపపడుతూ ప్రాధేయ పూర్వకంగా అడిగాడు భాస్కర్.

"క్షమించటమా'' నిర్లిప్తంగా అంది. "హాం క్షమించటమో, శిక్షించటమో ఆ భగవంతుడే చేశాడు నీకు. నా చేతుల్లో ఏమీలేదు'' అనేసి, రిజిగ్నేషన్ లెటర్ అక్కడ వున్న టేబులు మీదపెట్టి బయటికి వచ్చింది.

* *

తను ద్వేషించిన మనిషిమీద పగ సాధించాలని అనుకుంది. కానీ, అది తనకి చేతకాలేదు.

ఆపరేషన్‌చేసి, భాస్కర్‌కి ఒక కాలూ, చెయ్యీ తీసివేయవలసి వచ్చి నప్పుడు—ఆ ఆపరేషన్‌కి తను సహాయ పడి అతడ్ని కుంటివాడ్ని చేసి, తన సహాయంతో అతడ్ని బెడ్డుమీద పడుకో బెట్టు తున్నప్పుడు—ఇది సహాయమే అవు తుందా?

ఏమైనా తను సాధించలేని పగ, విధి అతన్ని జయించింది. తను అతని నాశనాన్ని చూడాలని కోరింది.

అతను ఇప్పుడు కుంటివాడు నడవ లేడు చెయ్యీ కాలూ కూడా లేవు. అతని కాలూ చెయ్యీ తనముందే తీసేస్తుంటే అది తను కళ్ళారా చూసింది.

ఎలాగైతేనేం, అతని సర్వనాశనాన్ని చూసింది.

కానీ—

అతని నాశనం కళ్ళారా చూశాను కదా అని సంతోషపడగలదా—?

అతని మూలంగా తన జీవితం సర్వ నాశనం అయిందని బాధపడగలదా—?

"ఏమిటో—జీవితం ఎండమావి. అంతే....'' హాస్పటల్‌నుంచి బయటికి వచ్చి రోడ్‌మీద నడుస్తూ పిచ్చిగా అను కుంది జోత్స్న.

—